

ఎస్సీ విద్యార్థుల ఖాతాల్లోకి 374 కోట్ల రూపాయల నిధులు

5

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103

సంపుటి - 2 సంచిక -310 గురువారం 12 మార్చి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## వారు పార్టీ మారినట్లు ఆధారాల్లేవు

### కడియం, దానంలకు క్లీన్‌చిట్



ఆ ఇద్దరూ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలే

తుది తీర్పు వెలువరించిన స్పీకర్ ప్రసాదరావు

తీర్పును స్వాగతించిన దానం, కడియం

నేడు సుప్రీంలో కేసు తుది విచారణ





**హైదరాబాద్,మార్చి 11 (జర్నలిస్ట్ వార్త);**
పార్టీ మారాన్ని పదిమంది ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసును స్పీకర్ మొత్తంగా కొట్టివేశారు. తాజాగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సంచలన తీర్పు ఇచ్చారు. ఈ ఇద్దరు ఎమ్మెల్యేలపై వేసిన అనర్హత పిటిషన్లను స్పీకర్ డిస్మిస్ చేశారు. వీరు పార్టీ మారినట్లు ఆధారాల్లేవని.. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా వారిద్దరూ బీఆర్ఎస్ పార్టీలో ఉన్నట్లు స్పీకర్ ప్రకటించారు. దానం నాగేందర్, కడియం శ్రీహరి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేలుగా గెలిచిన విషయం తెలిసిందే. ఆ తరువాత వారు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఆరోపణలు వచ్చాయి. పార్టీ ఫిరాయింపుల చట్టానికి వ్యతిరేకంగా వీరు పని చేస్తున్నారని.. వీరి శాసనసభ సభ్యత్వంపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్, బీజేపీ నుంచి పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం తుది తీర్పును ప్రకటించారు. తాజా విచారణలో తాము ఇప్పటికీ బీఆర్ఎస్‌లోనే ఉన్నామని, పార్టీ మారలేదని దానం నాగేందర్, కడియం శ్రీహరి స్పష్టం చేశారు. దానం, కడియం వాంగ్మూలాలను పరిగణనలోకి తీసుకున్న స్పీకర్.. వీరిద్దరినీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే గుర్తిస్తున్నట్లు ప్రకటించారు. **మిగతా 2లో...**

## భాధ్యతలేదా?

### ప్రవాస భారతీయుల పరిస్థితి దిగజారేలా కాంగ్రెస్ బాధ్యతారాహిత్య ప్రకటనలు చేస్తోంది: నరేంద్రమోదీ ఆగ్రహం

గల్ఫ్‌లోని పరిస్థితుల కారణంగా మన ఆందోళన సహజమేనన్న ప్రధానమంత్రి

లక్షలాది మంది భారతీయులు అక్కడ పని చేస్తున్నారన్న మోదీ

గల్ఫ్ దేశాల్లో ఉన్న భారతీయులను ఒంటరిగా వదలం అన్న నరేంద్ర మోదీ



**తిరువనంతపురంమార్చి 11 (జర్నలిస్ట్ వార్త);** ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీతోపాటు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలు సంధించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బాధ్యతా రహితంగా మాట్లాడుతున్నారని ప్రధాని మోదీ మండిపడ్డారు. దేశ యువతపై ఆయనకు అవగాహన లేదంటూ రాహుల్ తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ యువరాజుకి ఏమీ తెలీదంటూ ఆయనపై పరోక్ష విమర్శలు చేశారు. దేశ అభివృద్ధిని కాంగ్రెస్ యువరాజు చూడలేక పోతున్నారంటూ రాహుల్ తీరుపై మండిపడ్డారు. బుధవారం కేరళంలోని ఎర్నాకులంలో ప్రధాని మోదీ పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. యుద్ధం పేరుతో తనను కాంగ్రెస్ పార్టీ దూషిస్తోందని తెలిపారు. ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంపై కాంగ్రెస్, వామపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని పేర్కొన్నారు. **2లో...**

## వీగిపోయిన అవిశ్వాసం

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం తిరస్కరణ

మూజువాణి ఓటుతో వీగిపోయిన ప్రతిపక్షాల తీర్మానం

చర్చలో రాహుల్ గాంధీపై అమిత్ షా తీవ్ర విమర్శలు

చైర్‌లో కూర్చోకుండా కొత్త సంప్రదాయానికి తెరతీసిన ఓం బిర్లా

స్పీకర్‌ను ఇరుకున పెట్టాలనుకున్న విపక్షాల వ్యూహం విఫలం

**న్యూఢిల్లీ,మార్చి 11 (జర్నలిస్ట్ వార్త);**
లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. సుమారు 13 గంటల పాటు జరిగిన సుదీర్ఘ చర్చ అనంతరం, తీవ్ర గందరగోళం మధ్య తాత్కాలిక స్పీకర్ జగదాంబికా పాల్ నిర్వహించిన మూజువాణి ఓటుతో ఈ తీర్మానాన్ని తిరస్కరించారు. అవిశ్వాసంపై హోంమంత్రి **మిగతా 2లో...**



## అత్యవసర చమురు నిల్వల విడుదల..

### స్వాగతించిన భారత్

మార్కెట్ పరిస్థితులను గమనిస్తున్నామన్న అధికారి

ఐఈఏ ఏర్పడిన తర్వాత చమురు నిల్వలు విడుదల చేయడం ఆరవసారి



**న్యూఢిల్లీ,మార్చి 11 (జర్నలిస్ట్ వార్త);**
ఇరాన్, అమెరికా యుద్ధం కారణంగా చమురు సరఫరాలో అంతరాయం నెలకొన్న నేపథ్యంలో అత్యవసర చమురు నిల్వలను విడుదల చేయాలన్న ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ(ఐఈఏ) నిర్ణయాన్ని భారతదేశం స్వాగతించింది. ప్రపంచ ఇంధన మార్కెట్ పరిస్థితులను, మధ్యప్రాచ్యంలో మారుతున్న ఉద్రిక్త పరిస్థితులను ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తున్నట్లు ఒక ప్రభుత్వ అధికారి వెల్లడించారు.ఐఈఏ ప్రయత్నాలకు **మిగతా 2లో...**

## వెలుగుమట్లలో మోడల్ కాలనీ

డిసెంబర్ 9లో కాలనీ నిర్మాణం పూర్తి

సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం

రాష్ట్రంలో ప్రతి పేదవానికి ఇల్లు మా ప్రభుత్వ లక్ష్యం

నాలుగున్నర లక్షల ఇళ్ల నిర్మాణానికి 22,500 కోట్లు


వెలుగుమట్ బాధితులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన భట్టి



**ఖమ్మం,మార్చి 11 (జర్నలిస్ట్ వార్త);**
కాంగ్రెస్ సర్కారు పేదల గురించి ఆలోచించే ప్రభుత్వమని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈ రాష్ట్రంలో ఏ ఒక్క పేద కూడా గూడు ఉండకూడదని నిర్ణయించి ఇందిరమ్మ ఇల్ల పథకం అమలు చేస్తున్నామని అన్నారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూదాన్ భూమిలో అర్హులకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను భట్టి బుధవారం పంపిణీ చేశారు. మంత్రులు పొంగులేటి, తుమ్మలత కలసి ఆయన స్థల పట్టాలు అందచేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. పేదలందరికీ ఇల్లు ఉండాలనేది తమ ఆశయం అన్నారు. తొలి ఏడాదే 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు గుర్తుచేశారు. ఇళ్లు మంజూరు చేయడంతో పాటు.. నిర్మాణాన్ని పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. పేదల నిస్సహాయతను అడ్డుగా పెట్టుకుని కొందరు రాజకీయాలు చేశారు. అమాయకులను మోసం చేసి రూ.లక్షల్లో వసూలు చేశారు. పదేళ్ల అధికారంలో ఉన్న పార్టీ వెలుగుమట్ల పేదలకు నీరు, విద్యుత్ సౌకర్యం ఎందుకు కల్పించలేదని భట్టి ప్రశ్నించారు. ఇక్కడి పేదలను కొందరు మోసం చేస్తున్నారని కోర్టు చెప్పింది. మేం మానవీయ కోణంలో వెలుగుమట్ల పేదలకు న్యాయం చేస్తున్నాం. అర్హులకు స్థలంతో పాటు.. ఇంటి నిర్మాణం చేసి ఇస్తున్నాం. 412 మందిని అధికారికంగా గుర్తించి**మిగతా 2లో...**

## ప్రజాస్వామ్యంపై బహిరంగ దాడి

కడియం, దానంలకు క్లీన్‌చిట్‌పై కెటిఆర్



2లో.

## అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రవాణా వ్యవస్థ

### తెలంగాణ రూపురేఖలు మార్చేలా రవాణా, వైద్యరంగం అభివృద్ధి

'రోడ్ సెక్టార్ పాలసీ-2047' లక్ష్యంగా కీలక ఆదేశాలు

ట్రాఫిక్ ఫ్రీ నగరంగా హైదరాబాద్ అభివృద్ధి

హైదరాబాద్ నుంచి రోడ్డు కనెక్టివిటీ పెంచాలి

రోడ్ల విస్తరణ పనులు త్వరగా చేపట్టాలి

రాష్ట్రంలోని ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటికీ ఒక రింగ్ రోడ్డు

నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను త్వరగా పూర్తి

అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం

**హైదరాబాద్,మార్చి 11 (జర్నలిస్ట్ వార్త);**
తెలంగాణ రాష్ట్ర రూపురేఖలను మార్చే విధంగా, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రవాణా, వైద్య రంగాల్లో భారీ మార్పులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో 'రోడ్ సెక్టార్ పాలసీ-2047' లక్ష్యంగా కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో రవాణా వ్యవస్థను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరం నుంచి రాష్ట్రంలోని



## తెలంగాణ గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా

లోక్ భవన్‌లో తెలుగులో ప్రమాణం

సిఎం రేవంత్ తదితరుల హాజరు



2లో.

## ఆందోళనొద్దు

వంట గ్యాస్‌పై ప్రజల్లో ఆందోళన అవసరం లేదన్న కేంద్రం

ఎల్పీజీ ఉత్పత్తిని 25 శాతం పెంచాలని చమురు కంపెనీలను ఆదేశం

ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా చమురు దిగుమతి అవుతోందన్న కేంద్రం



2లో.

# భాధ్యతలేదా?

**మొదటిపేజీ తరువాయి**

గల్ఫ్‌లో భారతీయులు చిక్కుకోవాలని కాంగ్రెస్ పార్టీ కోరుకుంటుందన్నారు. ఆయా దేశాల్లోని భారతీయులను కాపాడేందుకు కేంద్రం అన్ని ఏర్పాట్లు చేస్తుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఇక ఈ పర్యటనలో పలు ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు చేశారు. అలాగే వివిధ పథకాలను ఆయన ప్రారంభించారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో విదేశాల్లో చిక్కుకున్న భారతీయుల్ని ఇండియాకు తీసుకొస్తామని, ఏ ఒక్కరినీ వదిలిపెట్టేది లేదని ప్రధాని మోదీ అన్నారు. ఒకవైపు ప్రపంచం సంక్షోభంలో ఉంటే కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తోందని మోదీ విమర్శించారు. త్వరలో కేరళం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మోదీ అక్కడి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కీలక ప్రసంగం చేశారు. విదేశాల్లో చిక్కుకున్న భారతీయుల్ని వదిలిపెట్టబోం. వారిని ఇండియాకు తీసుకొస్తాం. పశ్చిమాసియా సంక్షోభంలో మిగిలిపోయిన భారతీయులకు తగిన సాయం అందిస్తున్నాం. వాళ్ల క్షేమం, సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం. గల్ఫ్ కంట్రీస్‌లో ఉన్న భారతీయుల రక్షణ కోసం చర్యలు తీసుకుంటున్న అక్కడి ప్రభుత్వాలకు కృతజ్ఞతలు. మనవారి సేవలు గుర్తించి, తగిన సహాయం అందిస్తున్నాయి అక్కడి ప్రభుత్వాలు. ఆయా దేశాల్లోని భారతీయ రాయబార కార్యాలయాలు కూడా నిరంతరం పని చేస్తున్నాయి. ఒకవైపు ప్రపంచం సంక్షోభంలో ఉంటే కాంగ్రెస్ పార్టీ దీనిపై రాజకీయం చేస్తోంది. రెచ్చగొట్టేలా, బాధ్యతారాహిత్యమైన ప్రకటనలు చేస్తోంది. విదేశాల్లో ఉన్న భారతీయుల విషయంలో రాజకీయం చేయడం తగదన్నారు. ఒకవైపు ప్రభుత్వం నిరంతరం పని చేస్తుంటే ఈ అంశంలో రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. డ్రోన్ల తయారీలో దేశ యువత సాధిస్తున్న విజయాల గురించి కాంగ్రెస్ యువరాజు కి అవగాహన లేదు. కేరళ సహా అనేక రాష్ట్రాల్లోని స్టార్టప్‌లు డ్రోన్లు తయారు చేస్తున్నాయి. సంకుచిత మనస్తత్వం గలవారు ఇలాంటి దేశ ప్రగతిని చూడలేరు. బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీయే కూటమికి కేరళలో ఒక్కసారి అవకాశం ఇవ్వండి. అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చూపిస్తాం. రాష్ట్రం పేరును కేరళ నుంచి కేరళంనకు మార్చినందుకు ఆనందంగా ఉంది. గత ప్రభుత్వాలు కేరళకు ఏమీ చేయలేదని మోదీ అన్నారు.



ఈ పర్యటన అనంతరం తమిళనాడులో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్రంలో పలు అభివృద్ధి పథకాలకు ఆయన శంకుస్థాపన చేయనుండడంతోపాటు వివిధ పథకాలను ప్రారంభించనున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. మరికొద్ది రోజుల్లో తమిళనాడు, కేరళలతోపాటు అసోం, మేఘాలయా, పుదుచ్చేరి అసెంబ్లీలకు మార్చి నుంచి మే మాసాల మధ్య ఎన్నికల నగారా మోగనుంది. దీంతో ఆయా రాష్ట్రాల్లో అధికారం అందుకోవాలని బీజేపీ, కాంగ్రెస్‌తోపాటు వామపక్ష పార్టీలైన కమ్యూనిస్టు పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ఆ క్రమంలో ప్రధాని మోదీ బుధవారం కేరళ, తమిళనాడుల్లో పర్యటిస్తున్నారు. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు.



## తెలంగాణ గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా

### లోక్ భవన్‌లో తెలుగులో ప్రమాణం-సిఎం రేవంత్ తదితరుల హాజరు

హైదరాబాద్**మార్చి 11 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ నూతన గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా ప్రమాణ స్వీకారం చేశారు.. తెలుగులో ప్రమాణం చేయడం ఆసక్తిగా మారింది. లోక్‌భవన్‌లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు హాజరయ్యారు. ముందుగా పూర్తి వందేమాతరం గేయంతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం మంత్రులతో కలసి గవర్నర్ గ్రూప్ ఫోటో దిగారు. ఇక శివ్ ప్రతాప్ శుక్లా విషయానికి వస్తే.. ఆయన 73 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ నేపథ్యం కలిగిన నేత. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆయన, ఏబీవీపీ ద్వారా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. ఎమర్జెన్సీ సమయంలో జైలుకు సైతం వెళ్లారు. యూపీలో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, కేబినెట్ మంత్రిగా, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 2023-2026 మధ్య హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. తాజాగా తెలంగాణకు విచ్చేశారు.

## అత్యవసర చమురు నిల్వల విడుదల..

**మొదటిపేజీ తరువాయి**

అనుగుణంగా, ప్రపంచ మార్కెట్ స్థిరత్వం కోసం అవసరమైన చర్యలు తీసుకోవడానికి భారత్ సిద్ధంగా ఉందని ఆ అధికారి తెలిపారు. ఐఈఏలో భారత్ అసోసియేట్ మెంబర్ మరియు ఇంటర్నేషనల్ ఎనర్జీ కోఆపరేషన్‌లో చురుకైన భాగస్వామి.పశ్చిమాసియాలో కొనసాతున్న యుద్ధం కారణంగా, చమురు సంక్షోభం నుంచి గట్టెక్కించడానికి, ఇంధన మార్కెట్‌ను స్థిరీకరించడానికి సభ్య దేశాల అత్యవసర నిల్వల నుండి 400 మిలియన్ బ్యారెల్ల చమురును మార్కెట్లోకి తీసుకురావడానికి ఐఈఏ సభ్యులు అంగీకరించారు. ఐఈఏ సభ్య దేశాలు 1.2 బిలియన్ బ్యారెల్లకు పైగా అత్యవసర నిల్వలను కలిగి ఉన్నాయి.1974లో ఐఈఏ ఆవిర్భవించింది. నాటి నుంచి చమురు నిల్వలు విడుదల చేయడం ఇది ఆరవసారి. అంతకుముందు 1991, 2005, 2011, అలాగే 2022లో రెండుసార్లు అత్యవసర చమురు నిల్వలను విడుదల చేశాయి. పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో అత్యవసర చమురు నిల్వలను విడుదల చేయాలని ఐఈఏ బుధవారం నిర్ణయించింది.

## వీగిపోయిన అవిశ్వాసం

**మొదటిపేజీ తరువాయి**

అమిత్ షా సమాధానం ఇస్తున్న సమయంలో ప్రతిపక్షాలు తీవ్ర నినాదాలతో సభను అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.స్పీకర్ ఓం బిర్లా పక్షపాతంతో, ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఎంపీ మహ్మద్ జావేద్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనికి 118 మంది విపక్ష ఎంపీలు మద్దతు తెలిపారు. నిన్న చర్చను ప్రారంభించిన కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్, ఇది వ్యక్తిగతంగా బిర్లాను లక్ష్యం చేసుకోవడానికి కాదని, పార్లమెంట్ గౌరవాన్ని కాపాడటానికే అని పేర్కొన్నారు. దీనికి బదులిచ్చిన పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, స్పీకర్ పనితీరును గట్టిగా సమర్థించారు.

అయితే, చర్చకు సమాధానమిచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రతిపక్షాల ఆరోపణలను తీవ్రంగా తిప్పికొట్టారు. స్పీకర్ స్థానం అత్యంత పవిత్రమైందని, ఆయన నిర్ణయాలను సుప్రీంకోర్టులో సైతం ప్రశ్నించలేమని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో, నేటి కాంగ్రెస్ మిత్రపక్షాలైన సమాజ్‌వాదీ పార్టీ, కమ్యూనిస్టు పార్టీలే స్పీకర్లపై అవిశ్వాసం పెట్టాయని గుర్తుచేశారు. ఆ సమయంలో స్పీకర్లు చైర్‌లోనే కూర్చోగా, ఈసారి ఓం బిర్లా మాత్రం తీర్మానంపై నిర్ణయం వెలువడే వరకు చైర్‌లో కూర్చోకుండా కొత్త పార్లమెంటరీ సంప్రదాయానికి శ్రీకారం చుట్టారని ప్రశంసించారు.

ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అమిత్ షా లక్ష్యంగా చేసుకున్నారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నప్పుడు రాహుల్ తరచూ విదేశీ పర్యటనలకు వెళ్తారని, బడ్జెట్, మహిళా రిజర్వేషన్ బిల్లు వంటి కీలక చర్చల్లో పాల్గొనడానికి ఎందుకు ఇష్టపడరని ప్రశ్నించారు. "సమావేశాలు వచ్చినప్పుడల్లా ఆయన విదేశీ పర్యటనలు ప్లాన్ చేసుకుంటారు. మరి విదేశాల నుంచి ఇక్కడ మాట్లాడతారా?" అని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.మొత్తం మీద స్పీకర్‌ను ఇరుకున పెట్టాలనుకున్న ప్రతిపక్షాల వ్యూహం ఫలించలేదు. పైగా ప్రభుత్వ ఎదురుదాడితో ప్రతిపక్షాలే ఆత్మరక్షణలో పడినట్లు కనిపించింది. ఈ పరిణామం విపక్షాలకు రాజకీయంగా ఇబ్బందికరంగా మారింది.

## వారు పార్టీ మారినట్లు ఆధారాల్లేవు

**మొదటిపేజీ తరువాయి**

అనర్హత వేటు పిటిషన్లను కొట్టేశారు. దీంతో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు ఊరట లభించినట్లయ్యింది. ఇదిలాఉంటే.. గురువారం సుప్రీంకోర్టులో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అంశంపై విచారణ జరగనుంది. ఇప్పటికే పలుమార్లు విచారించిన అత్యున్నత న్యాయస్థానం.. కేసు మళ్లీ విచారణకు వచ్చేలోగా స్పీకర్ తన నిర్ణయం ప్రకటించాలని సూచించింది. ఈ మేరకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం తీర్పు వెలువరించారు. ఇప్పటికే 8మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చిట్ ఇచ్చారు. ఇప్పుడు మరో ఇద్దరికి క్లీన్ చిట్ ఇవ్వండతో మొత్తం పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ పదిమంది కాంగ్రెస్‌లో చేరారు. అయితే టెక్నికల్‌గా ఇది రుజువు కాకపోవడంతో దీనిని స్పీకర్ తిరస్కరించారు. ఈ క్రమంలో నేటి సుప్రీం విచారణలో ఏం జరుగుతుందో అన్న ఉత్కంఠ నెలకొంది.

## వంట గ్యాస్‌పై ప్రజల్లో ఆందోళన అవసరం లేదన్న కేంద్రం

**మార్చి 11 (జర్నలిస్ట్ వార్త):**

పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో దేశవ్యాప్తంగా వంట గ్యాస్‌పై ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. బుకింగ్ చేసిన రెండున్నర రోజుల్లో వంట గ్యాస్ సిలిండర్ డెలివరీ అవుతుందని తెలిపింది. ఎల్పీజీ ఉత్పత్తిని 25 శాతం పెంచాలని చమురు కంపెనీలను ఇప్పటికే ఆదేశించినట్లు వెల్లడించింది. పెట్రోల్, డీజిల్, ముడి చమురు, వంట గ్యాస్ సరఫరా విషయంలో ఆందోళన అవసరం లేదని తెలిపింది.కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. దేశవ్యాప్తంగా ఇంధన సరఫరా సజావుగా సాగేలా చూడాలని సూచించింది. దేశీయ అవసరాలకు కావాల్సిన ముడి చమురులో 75 శాతానికి పైగా హోర్ముజ్ జలసంధికి సంబంధం లేని ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపింది. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీజీపీలు, చీఫ్ సెక్రటరీలను ఆదేశించింది.

గ్లోబల్ షిప్పింగ్ మార్గాల్లో ఆటంకాలు ఉన్నప్పటికీ, భారత్‌కు ముడి చమురు దిగుమతులు నిరంతరాయంగా అందుతున్నాయని కేంద్ర పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత్‌కు చమురు తీసుకువచ్చే అదనపు కార్గో షిప్‌లు కూడా వస్తున్నాయని వెల్లడించారు. పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతున్నప్పటికీ మన దేశంలో ఇంధన అవసరాలకు ఎలాంటి ఇబ్బంది లేదని, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

# ప్రజాస్వామ్యంపై బహిరంగ దాడి

### కడియం, దానంలకు క్లీన్‌చిట్‌పై కెటిఆర్

**హైదరాబాద్,మార్చి 11 (జర్నలిస్ట్ వార్త):**

పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరికి శాసనసభాపతి ప్రసాద్ కుమార్ క్లీన్ చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యంపై బహిరంగ దాడి అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ స్పీకర్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజుగా అభివర్ణించారు. ఇది కేవలం ఒక తీర్పు కాదు.. అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా రాజ్యాంగ వ్యవస్థలను ఉపయోగించే ఉదాహరణ అని పేర్కొన్నారు. ఇలాంటి నిర్ణయాలు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయన్నారు. తెలంగాణ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని.. సరైన సమయంలో సమాధానం చెబుతారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ బీఫామ్ మీద ఎంపీగా పోటీ చేసిన వ్యక్తికే క్లీన్‌చిట్ ఇవ్వడం అంటే ప్రజల తీర్పును అవమానించడమేనని వ్యాఖ్యానించారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ స్పీకర్ తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజు అని కేటీఆర్ అభివర్ణించారు. ఇది కేవలం తీర్పు కాదు.. అధికారంలో ఉన్న వారికి అనుకూలంగా రాజ్యాంగ వ్యవస్థను ఉపయోగించే ఉదాహరణ అన్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన పదవులను లాభాల కోసం మార్చుకుంటే.. స్పీకర్ దానికి ఆమోద ముద్ర వేస్తే.. ప్రజాస్వామ్య విలువలు ఎక్కడ నిలుస్తాయని ప్రశ్నించారు. ఇలాంటి నిర్ణయాలు ప్రజల విశ్వాసానికి దెబ్బ అని అన్నారు.

### స్పీకర్ తీర్పు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు ఎమ్మెల్యేలకు క్లీన్‌చిట్‌పై బండి సంజయ్

కడియం శ్రీహరి, దానం నాగేందర్ లపై అనర్హత పిటిషన్‌ను స్పీకర్ గడ్డం ప్రసాద్ డిస్మిస్ చేయడం దారుణమని కేంద్రమంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ పాలనలో శాసన వ్యవస్థే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని విమర్శించారు. కన్నతల్లే బిడ్డను చంపడం ఎంత పాపమో.. శాసన వ్యవస్థే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం అంత కంటే పాపమని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. శాసన వ్యవస్థే ఫిరాయింపులను ప్రోత్సహించేలా స్పీకర్ తీర్పు ఇచ్చారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, కాంగ్రెస్ టికెట్‌పై ఎంపీగా పోటీ చేసినప్పటికీ అనర్హత వేటు వర్తించకపోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. కాంగ్రెస్ కండువా కప్పుకుని ప్రచారం చేసినా పార్టీ ఫిరాయించలేదని చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. గాంధీభవన్‌లో సంసారం చేస్తూ.. కాంగ్రెస్ తరపున ప్రచారం చేస్తున్నా ఫిరాయింపులు వర్తించకపోవడం ప్రజాస్వామ్యానికే చేటు అని బండి సంజయ్ విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించింది నిజం కాదా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి దీనిపై వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. శాసన వ్యవస్థపై ప్రజలకు పూర్తిగా నమ్మకం కోల్పోయేలా స్పీకర్ తీర్పు ఇచ్చారని బండి సంజయ్ అన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను కాంగ్రెస్ ఆఫీసులో బంధించాలని చూస్తున్నారని ఆరోపించారు. శాసనసభ స్పీకర్? స్వతంత్య్రంగా వ్యవహరించాలే తప్ప డూప్లికేట్ గాంధీ కుటుంబానికి తాబేదారులా వ్యవహరించకూడనది సూచించారు. ప్రజాస్వామ్యవాదులారా నోరు విప్పండి అని పిలుపునిచ్చారు. పూర్తిగా గాడి తప్పిన శాసన వ్యవస్థను దారిలో పెట్టాల్సిన బాధ్యత ప్రజలదే అని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో విసిరేస్తే తప్ప తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించలేమని బండి సంజయ్ స్పష్టం చేశారు. స్పీకర్ తీర్పుపై హైకోర్టుకు వెళ్తామని తెలిపారు. న్యాయ వ్యవస్థపై తమకు సంపూర్ణ నమ్మకం ఉందని తెలిపారు. బెంగాల్‌లో అనర్హత పిటిషన్ పై స్పీకర్ ఇదే తరహా తీర్పు ఇస్తే హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలతో కొట్టేసిందని గుర్తుచేశారు. తెలంగాణలోనూ ఫిరాయింపులపై చెంప చెళ్లుమనేలా న్యాయ వ్యవస్థ తీర్పు ఇస్తుందనే నమ్మకం ఉందని వ్యాఖ్యానించారు.

# వెలుగుమట్లలో మోడల్ కాలనీ

**,మొదటిపేజీ తరువాయి**

పట్టాలు ఇచ్చి న్యాయం చేస్తున్నాం అన్నారు. ఇన్నాళ్లు వెలుగుమట్ల పేదలను ఎందరో వచ్చి బెదిరించారు. ఇకపై వీరిని ఎవరూ బెదిరించలేరు.. డబ్బు వసూలు చేయలేరు. ఇకపై వారు నిర్భయంగా బతకవచ్చు. పట్టాలు పొందిన వారు రేపటి నుంచే తమ ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని భట్టి విక్రమార్క చెప్పారు.వెలుగుమట్లలో పేదల కోసం మోడల్ కాలనీ నిర్మిస్తాం, దేశంలోని ఇతర రాష్ట్రాల వారు వచ్చి చూసే విధంగా మోడల్ కాలనీ నిర్మాణం జరుగుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. వెలుగుమట్లలో పేదలకు పంచగా మిగిలిన 16 ఎకరాల భూమిని తెలంగాణ పబ్లిక్ స్కూల్, ఇతర ప్రభుత్వ విద్యా సంస్థల నిర్మాణానికి ఉపయోగిస్తాం అన్నారు. భూదాన్ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వడమే కాదు కరెంటు, నీళ్లు, రోడ్లు, ఆసుపత్రి, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించండి డిసెంబర్ 9 కల్లా మోడల్ కాలనీలో ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలి అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశిస్తున్నాను, ముగ్గురు మంత్రులము కలిసి సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానిస్తాం డిసెంబర్ 9 కల్లా నిర్మాణం పూర్తి చేయాలి పాలు పొంగించాలి, సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా గృహప్రవేశాలు జరగాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. ఇది పేదల పక్షాన మాకు ఉన్న నిబద్ధత అన్నారు. ఇల్లు కట్టిస్తామని పది సంవత్సరాలపాటు పరిపాలించిన వారు చెప్పిన మాటలు నమ్మి చూసి చూసి పేదల కళ్ళు కాషాయని, వారు ఒక్క ఇల్లు కూడా పంపిణీ చేయలేదని తెలిపారు. అలాంటి వారికి మా ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు లేదన్నారు. ఈ రాష్ట్రంలో జీవించే ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించాలి అనేది సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని క్యాబినెట్ ఆలోచన అన్నారు. ఆ ఆలోచనలో భాగంగానే రాష్ట్రంలో పేదవారి కోసం నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇల్లు నిర్మించేందుకు 22,500 కోట్లు ఒకేసారి మంజూరు చేసి చేసే చరిత్రలోనే రికార్డు సృష్టించిన ప్రభుత్వం తమది అనే డిప్యూటీ సీఎం తెలిపారు. ఇలాంటి ప్రభుత్వంపై కావాలని పేదలకు మేలు జరగవద్దని కొద్దిమంది బురద జల్లుతున్నారు అని డిప్యూటీ సీఎం ఆరోపించారు. గత కొన్ని సంవత్సరాలుగా మాఫియా వెలుగుమట్లలో పేదల నుంచి డబ్బులు వసూలు చేసింది వారికి కనీస సౌకర్యాలు లేకుండా సమాంతర వ్యవస్థను ఏర్పాటు చేసింది, పేదలు ఆత్మగౌరవంతో బతికేలా చేయాలని వెలుగుమట్లలో అవసరమైన చర్యలను ప్రభుత్వం చేపట్టింది అన్నారు. పేదలు చట్టబద్ధంగా న్యాయబద్ధంగా ఆత్మ గౌరవంగా బతికేందుకు ఎన్ని కోట్లయినా ఖర్చు చేసేందుకు ప్రజా ప్రభుత్వం వెనుకాడదని తెలిపారు. వెలుగుమట్లలో అర్హత కలిగిన 412 మందిని గుర్తించి తన తమ భేదం లేకుండా జిల్లా పట్టాలు పంపిణీ చేసి ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. వివిధ జిల్లాల్లో ఉన్న 101 మంది పేదలకు వారి గ్రామాల్లో ఉన్న స్థలాల్లో ఇందిరమ్మ నిర్మాణానికి అనుమతి పత్రాలు మంజూరు చేసినట్టు తెలిపారు. పేదల నిస్సహాయతను అడ్డుపెట్టుకొని బతికే మాఫియా శక్తులను దరిదాపుల్లోకి రానివ్వద్దని పేదలకు, అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. వెలుగుమట్ల పేదలను కొన్ని ముఠాలు మోసం చేశాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. భూదాన్ ట్రస్టు సభ్యులుగా చెప్పుకొని కొందరు మోసం చేసినట్లు ఆరోపించారు. ఇన్నాళ్లు కోర్టులో ఉన్నందువల్లే వెలుగుమట్లలో సదుపాయాలు కల్పించలేకపోయినట్లు తెలిపారు. కోర్టు తీర్పు మేరకే ఇక్కడి భూముల్లో ఉన్నవారిని కలెక్టర్ ఖాళీ చేయించాల్సి వచ్చిందన్నారు. ఖాళీ చేయించే సమయంలో పేదలపై ఒక్క లాఠీ దెబ్బ పడొద్దని చెప్పామన్నారు. భూదాన్ భూములను ఎప్పటికైనా పేదలకే ఇవ్వాలని నిర్ణయించినట్లు వివరించారు.

ఏ జిల్లా వారైనా సరే.. ఇంటి స్థలం లేకుంటే ఇంటి పట్టాలు ఇస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. వెలుగుమట్లలో 412 మందికి న్యాయం చేస్తున్నామన్నారు. ఇక్కడి భూదాన్ భూముల్లో 311 మందికి ఇళ్ల స్థలాలు ఇస్తున్నట్లు చెప్పారు. మరో 101 మంది తమకు సొంత స్థలం ఉందని.. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అడిగారని వివరించారు. వెలుగుమట్ల భూముల విషయంలో కొందరు మొసలి కన్నీరు కార్చారు. పదేళ్లు అధికారంలో ఉండి పేదలకు ఇంటి పట్టాలు ఎందుకు ఇవ్వలేదు? పేదల పట్ల జాలి ఉంటే వారికి సాయం ఎందుకు చేయలేదు. మళ్లీ అధికారంలోకి వస్తామని కొందరు పగటి కలలు కంటున్నారు. పేదల కష్టాలు తెలిసిన నిజమైన ప్రజా ప్రభుత్వం మాది. వెలుగుమట్లలో అన్ని మౌలిక వసతులను కల్పిస్తాం. లబ్దిదారుల ఇళ్ల నిర్మాణం కంటే ముందే సదుపాయాలు పూర్తి చేస్తాం' అని పొంగులేటి అన్నారు.

## అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రవాణా వ్యవస్థ

ఏ ప్రాంతానికైనా నిర్ణీత సమయంలో చేరుకునేలా రోడ్ల నెట్ వర్క్ ను అభివృద్ధి చేయాలని అన్నారు. నగరంలో పెరుగుతున్న వాహనాల సంఖ్యతో వీపరీతమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ట్రాఫిక్ కష్టాల నుంచి విముక్తి చేయడానికి కనెక్టివిటీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్య ఇవ్వాలని ఆదేశించారు. ఇప్పటికే గుర్తించిన ప్రాంతాలలో పనులను తక్షణమే ప్రారంభించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటికీ ఒక రింగ్ రోడ్డు నిర్మించి, వాటిని జాతీయ రహదారులతో అనుసంధానించాలని సీఎం తెలిపారు. దీని వల్ల జిల్లాల ఆర్థికాభివృద్ధి వేగవంతం అవుతుందని ఆయన ఆకాంక్షించారు. రోడ్ల అభివృద్ధి పనుల్లో భూ సేకరణ వంటి అడ్డంకులు కలగకుండా జిహెచ్ఎంసి, రెవెన్యూ విభాగాల మధ్య పూర్తి సమన్వయం ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. రోడ్ సెక్టార్ పాలసీ-2047 కు అనుగుణంగా రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సమీక్షా సమావేశంలో అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నగరం నుంచి రాష్ట్రంలో ఎక్కడికైనా నిర్ణీత సమయంలో చేరుకునేలా రోడ్ల అభివృద్ధి జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దడానికి కనెక్టివిటీ రోడ్ల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను గుర్తించాలన్నారు. ఇప్పటికే గుర్తించిన ఏరియాలలో రోడ్ల అభివృద్ధి పనులు మొదలు పెట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సిఎం అన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు తలెత్తకుండా స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని, దీనిపై సాధ్యాసాధ్యాలు నిశితంగా అధ్యయనం చేయాలని సమీక్షా సమావేశంలో అధికారులను ఆదేశించారు. ఇక పేద ప్రజలకు అత్యాధునిక వైద్యం చేరువ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న అన్ని టీచింగ్ హాస్పిటల్స్, పెద్ద ఆసుపత్రుల పనులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# జాతీయ స్థాయి శిక్షణకు హాజరైన కొత్తూరు సర్పంచ్

## వరంగల్ జిల్లా ప్రతినిధిగా ఢిల్లీ సమావేశానికి స్వప్నసంతోష్ ఎంపిక

### సశక్త్ పంచాయతీ అభియాన్‌లో గ్రామాభివృద్ధిపై దిశానిర్దేశం

**రాయపర్తి,/ మార్చి 11 (జర్నలిస్ట్ వార్త):** దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సర్పంచుల శిక్షణా సమావేశానికి మండలంలోని కొత్తూరు గ్రామ సర్పంచ్ కంధికట్ల స్వప్నసంతోష్ హాజరయ్యారు. వరంగల్ జిల్లా నుంచి ప్రతినిధిగా ఎంపిక కావడం గ్రామానికి గౌరవంగా నిలిచింది. గ్రామ పంచాయతీల బలోపేతం, సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సశక్త్ పంచాయతీ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ శిక్షణా సమావేశాలను నిర్వహిస్తున్నారు. రెండు రోజుల పాటు కొనసాగే ఈ సమావేశాల్లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన గ్రామ సర్పంచులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, గ్రామ పాలనలో ఆధునిక సాంకేతికత వినియోగం, పంచాయతీల డిజిటలైజేషన్, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు సమర్థంగా చేరవేయడం వంటి అంశాలపై నిపుణులు సమగ్రంగా శిక్షణ అందిస్తున్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర, బాధ్యతలపై కూడా ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నారు. "ఒకసారి సర్పంచ్ అయితే ఎప్పటికీ సర్పంచ్ లాగే బాధ్యతగా ఉండాలి" అనే నినాదంతో ప్రజాప్రతినిధుల్లో సేవాభావం, నాయకత్వం పెంపొందించేలా ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాల్లో పాల్గొనడం పట్ల సర్పంచ్ స్వప్నసంతోష్ హర్షం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా వచ్చిన ప్రతినిధులతో కలిసి గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించే అవకాశం లభించడం సంతోషకరమని తెలిపారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను కొత్తూరు గ్రామ అభివృద్ధికి పూర్తిస్థాయిలో ఉపయోగించుకుంటానని ఆమె వెల్లడించారు.







# ఉత్తమ ఎంఈఓగా రాజేశ్వరరావుకు అవార్డు

### సత్కరించిన స్థానిక విద్యాసంస్థలు

**సత్తుపల్లి/, మార్చి 11 (జర్నలిస్ట్ వార్త):** మండలంలో విద్యా అభివృద్ధికి విశేష కృషి చేసిన సత్తుపల్లి మండల విద్యాశాఖ అధికారి రాజేశ్వరరావుకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తమ ఎంఈఓ అవార్డును ప్రదానం చేసింది. ఇటీవల హైదరాబాదులో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారులు ఆయనకు ఈ అవార్డును అందజేశారు. సత్తుపల్లి మండలంలో విద్యా సంబంధిత కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయడం, పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంలో కృషి చేయడం, మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం, విద్యార్థులు మరియు ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకుంటూ అంకితభావంతో సేవలందించడం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని ఈ అవార్డును అందజేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే మండలంలో అక్షరాస్యత పెంపొందించడంలో రాజేశ్వరరావు చేసిన సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సత్తుపల్లి పట్టణంలోని పలు ప్రైవేట్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో బుధవారం రాజేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఆయన విద్యారంగానికి అందిస్తున్న సేవలను కొనియాడుతూ పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీకటి శ్రీనివాసరావు, పులి శ్రీనివాసరావు, నాయుడు వెంకటేశ్వరరావు, ఎదుల్ల మురళి తదితరులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# హైదరాబాద్‌లో బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డు అందుకున్న షేక్ ఇస్మాయిల్



**కల్లూరు,/ మార్చి 11 (జర్నలిస్ట్ వార్త):** హైదరాబాద్‌లో ఇండియన్ బ్రిలియంట్ ఒలింపియాడ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో తెలంగాణ గ్రామర్ స్కూల్ ప్రిన్సిపాల్ షేక్ ఇస్మాయిల్ "బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డు"ను అందుకున్నారు. విద్యారంగంలో ఆయన అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు మెమెంటోతో పాటు ప్రశంసాపత్రం అందజేశారు. అదే కార్యక్రమంలో తెలంగాణ గ్రామర్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు కూడా ప్రతిభ చాటారు. విద్యార్థిని ఎం. జయంతి జాతీయ స్థాయి టాపర్‌గా నిలిచింది. విద్యార్థి ఎం.డి. మాసీల్ అలీ ఖాన్ రాష్ట్ర స్థాయి టాపర్‌గా గుర్తింపు పొందాడు. వీరికి మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఎస్.కె. జానీమియా, అకడమిక్ డైరెక్టర్ కేశవరావు పాల్గొని ప్రిన్సిపాల్ షేక్ ఇస్మాయిల్‌తో పాటు ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల విజయాలకు ఇది గర్వకారణమని వారు తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఇండియన్ బ్రిలియంట్ ఒలింపియాడ్ సంస్థ ఘనంగా నిర్వహించింది.

# ములుకనూరులో ఉచిత వైద్య శిబిరం 179 మందికి పరీక్షలు





**భీమదేవరపల్లి/మార్చి11 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరంలో స్థానిక ప్రజలకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. మొత్తం 179 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు మెడికల్ ఆఫీసర్ జ్యోత్స్న తెలిపారు. ఇందులో జనరల్ మెడిసిన్‌లో 60 మందికి, ఆర్థోపెడిక్ విభాగంలో 49 మందికి, ఆప్తమాలజీ విభాగంలో 40 మందికి, డెంటల్ విభాగంలో 9 మందికి, గైనకాలజీ విభాగంలో 16 మందికి, పిడియాట్రిక్ విభాగంలో 5 మందికి వైద్య సేవలు అందించామని పేర్కొన్నారు. అదనపు చికిత్స అవసరమైన 36 మందిని వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

### లబ్ధిదారులతో సమావేశంలో సర్పంచ్ బిల్లా యాదగిరి సూచన





**వేలేరు/హనుమకొండ బ్యూరో, మార్చి 11 (జర్నలిస్ట్ వార్త):** వేలేరు మేజర్ గ్రామపంచాయతీలో మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బిల్లా యాదగిరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు గృహ కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. మొదటి విడతలో మంజూరైన ఇండ్ల లబ్ధిదారులు ఈ నెలాఖరు వరకు తమ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. ఏవైనా కారణాల వల్ల ఇల్లు నిర్మించుకోలేని పేద కుటుంబాలకు సంబంధిత ఏజెన్సీ ద్వారా ఇళ్ల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే గౌరవ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో వేలేరు గ్రామానికి తదుపరి రెండో విడతలో మరిన్ని ఇండ్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని మహిళా సంఘాల ద్వారా రుణాల రూపంలో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సంబంధిత వివో ల ద్వారా అవసరమైన రుణాలు లబ్ధిదారులకు అందజేయబడతాయని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి లబ్ధిదారు తన ఇల్లు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సర్పంచ్ సూచించారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో గ్రామ ఉపసర్పంచ్ శ్రీకర్, హౌసింగ్ ఏఈ, గ్రామపంచాయతీ కార్యదర్శి రవికుమార్, మండల సమైక్య అధ్యక్షురాలు రేణుక, వార్డు సభ్యులు సంధ్య, మౌనిక, ప్రవళిక, చైతన్య, సంధ్య, సురేష్, సునీల్, క్లస్టర్ సీసీ రమాదేవి, వివో అధ్యక్షురాలు రాణి, రాజమ్మ, ప్రేమలత, గ్రామ పెద్దలు మరియు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

# అన్న మాట ప్రకారం.. 15 రోజుల్లోనే!

### వెలుగుమట్ల నిర్వాసితులకు ఇండ్ల పట్టాల పంపిణీ

### డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మలతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి







**ఖమ్మం, /మార్చి 11 (జర్నలిస్ట్ వార్త):** రాజకీయం అంటే గద్దెనెక్కి దొరతనం చేయడం కాదని, పేదోడి కన్నీరు తుడవడమే నిజమైన ప్రజాసేవ అని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ నెల 1వ తేదీన ఇదే వేదికపై ఇచ్చిన హామీ ప్రకారం 15 రోజుల్లోపు సమస్య పరిష్కరిస్తానని చెప్పిన మాటను నిలబెట్టుకుంటూ గడువు ముగిసేలోపే వెలుగుమట్ల నిర్వాసితులకు ఇండ్ల పట్టాలు అందించడం ఆనందంగా ఉందని తెలిపారు.
బుధవారం ఖమ్మం ఐడీఓసీ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి 311 మంది వెలుగుమట్ల నిర్వాసితులకు ఇండ్ల పట్టాలు, మంజూరు పత్రాలను మంత్రి పొంగులేటి అందజేశారు.

**కళ్లుండి చూడని కబోదుల్లా వ్యవహరించారు**

గత ప్రభుత్వ వైఫల్యాలను మంత్రి తీవ్రంగా విమర్శించారు. 2017 నుంచి వెలుగుమట్ల కాలనీలో నివసిస్తున్న పేదలు తాగునీరు లేక, పాములు జెర్రుల మధ్య ఇబ్బందులు పడుతున్నా గత ప్రభుత్వానికి అవి కనిపించలేదని విమర్శించారు. 2023లో ఇదే కాలనీని కూల్చివేయడానికి ప్రయత్నించినప్పుడు పేదలు ప్రతిఘటించగా వెనుదిరిగిన వారు ఇప్పుడు పేదల గురించి మాట్లాడటం ఆశ్చర్యంగా ఉందన్నారు.

**పగటి కలలు కనొద్దు**

ప్రతిపక్ష నేతలు 'రెడ్ బుక్' గురించి మాట్లాడడంపై కూడా మంత్రి పొంగులేటి స్పందించారు. చీకటి పడకముందే ఎండలో పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు మరోసారి అటువంటి దొరల పాలనకు అవకాశం ఇవ్వబోరని, వారి కలలు కలలుగానే మిగిలిపోతాయని వ్యాఖ్యానించారు.

**అర్హతే మా ప్రామాణికం**

ప్రజా ప్రభుత్వం ఎవరిపట్ల కక్ష సాధింపులు పెట్టుకోదని మంత్రి స్పష్టం చేశారు. తమను విమర్శించిన వారైనా సరే నిజంగా అర్హులైతే వారికి కూడా పట్టాలు ఇచ్చామని తెలిపారు. ఇక్కడ 311 మందికి ఇండ్ల స్థలాలతో పాటు ఇళ్లు నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే ఇండ్ల స్థలాలు ఉన్న మరో 101 మందికి వారి గ్రామాల్లోనే ఇందిరమ్మ మంజూరు పత్రాలు అందజేశామని చెప్పారు.

**మోడల్ కాలనీగా అభివృద్ధి**

పట్టాలు ఇచ్చి బాధ్యత ముగిసినట్లు కాదని, వారం రోజుల్లో తాగునీటి సౌకర్యం కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రోడ్లు, డ్రైనేజీతో పాటు పాఠశాల, ఫంక్షన్ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ వంటి సదుపాయాలతో కాలనీని మోడల్ కాలనీగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరిలోనూ తల్లిని చూసే సంస్కృతి మనది

### 15వ బెటాలియన్ దళాధిపతి అంజయ్య -విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించిన శ్రీ రామకృష్ణ సేవాసమితి





**సత్తుపల్లి, /మార్చి 11 (జర్నలిస్ట్ వార్త):** ప్రతిదానిలోనూ తల్లిని దర్శించే మహత్తరమైన సంప్రదాయం భారతీయ సంస్కృతికి ప్రత్యేకత అని గంగారం 15వ బెటాలియన్ దళాధిపతి అంజయ్య అన్నారు. శ్రీ రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సత్తుపల్లి విభాగంలోని విద్యార్థుల కోసం "భారతీయ మహిళ" అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బుధవారం జరిగిన బహుమతుల ప్రదాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అంజయ్య మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో మహిళలకు అత్యున్నత స్థానం ఉన్నదని తెలిపారు. భూమిని భూమాతగా, అన్నాన్ని అన్నపూర్ణగా, దాహం తీర్చే నీటిని గంగమ్మగా, మనకు అనేక విధాలుగా ఉపకారం చేసే గోవును గోమాతగా పూజించే గొప్ప సంప్రదాయం మన భారతదేశానిదని వివరించారు.
ప్రపంచం ఎంత అభివృద్ధి చెందినా మహిళలు సురక్షితంగా లేకపోతే ఆ సమాజం వెనుకబడినట్టే అవుతుందని ఆయన పేర్కొన్నారు. స్త్రీలను గౌరవించే చోటే దేవతలు నివసిస్తారని ఆయన అన్నారు. విద్యార్థులు భారతీయ సంస్కృతి విలువలను తెలుసుకుని వాటిని జీవితంలో ఆచరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి నిర్వాహకులు చీకటి శ్రీనివాసరావు, చల్లగుల్ల శ్రీనివాసరావు, గట్టే వాసు, నాయుడు వెంకటేశ్వరరావు, పసుపులేటి నాగేశ్వరరావు, ఎదుళ్ళ మురళి, పులి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కేతినేని కుటుంబ వివాహ వేడుకలో పాల్గొన్న మువ్వా విజయబాబు



**తల్లాడ,/ మార్చి 11 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని అంజనాపురం గ్రామానికి చెందిన కేతినేని చలపతిరావు, సైదేశ్వరి దంపతుల కుమారుని వివాహ వేడుకలో టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెండ్లికుమారుడిని ఆశీర్వదించి, వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేతినేని వీరరామారావు, సందీప్, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మువ్వా విజయబాబు అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై వధూవరులకు ఆశీస్సులు అందజేశారు.

## మదర్ తెరిసా సేవాసదనంలో అన్నదానం



**మధిర, /మార్చి 11 (జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలో బండి రామారావు వర్ధంతి సందర్భంగా మధిర పట్టణంలోని మదర్ తెరిసా సేవాసదనం మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో అన్నదానం నిర్వహించారు. దుందిరాలపాడు మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు ఎస్. అనిత ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక దివ్యాంగ పిల్లలకు భోజనం వడ్డించి సేవాభావాన్ని చాటుకున్నారు. బండి రామారావు పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని మానసిక దివ్యాంగ పిల్లల తరఫున దేవుని ప్రార్థించారు.

బండి రామారావును స్మరించుకుంటూ మానసిక దివ్యాంగ పిల్లలకు అన్నదానం నిర్వహించడం అభినందనీయమని పునరావాస కేంద్రం నిర్వాహకులు తెలిపారు. ఈ సేవా కార్యక్రమం నిర్వహించిన అనితకు కేంద్రం తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.

# ఆరేపల్లికి జాతీయ పురస్కారం

### అభివృద్ధి పథంలో గ్రామం మాదిరి గ్రామంగా తీర్చిదిద్దుతా: సర్పంచ్ ప్రవంతి రాజు

**ఎల్కతుర్తి, /మార్చి 11 (జర్నలిస్టు వార్త):** ఎల్కతుర్తి మండలంలోని ఆరేపల్లి గ్రామానికి స్వచ్ఛమైన త్రాగునీటి అందుబాటులో భాగంగా జాతీయ స్థాయి పురస్కారం లభించడం ఆనందకరమని గ్రామ సర్పంచ్ పోతారబోయిన ప్రవంతి రాజు తెలిపారు. గ్రామానికి వచ్చిన ఈ గుర్తింపు పట్ల గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఆరేపల్లి గ్రామానికి మొదటి సర్పంచ్ బూర్గుల రామారావు అని, అప్పటి నుంచి గ్రామం అభివృద్ధి దిశగా పలు కార్యక్రమాలు చేపట్టబడుతున్నాయని తెలిపారు. విశాలమైన రహదారులు, గ్రామ పంచాయతీ భవనం వంటి సౌకర్యాలతో పాటు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సంకల్పంతో పనిచేస్తున్నామని అన్నారు. గ్రామంలో ప్రత్యేక నీటి శుద్ధి కేంద్రం లేకపోయినా ప్రభుత్వం ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ నీటినే వినియోగిస్తూ ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందిస్తున్నామని వివరించారు. ప్రతి పదిహేను రోజులకు ఒకసారి నీటి నిల్వ ట్యాంకులను శుభ్రం చేస్తూ ఎలాంటి రసాయనాలు లేని నీటిని ప్రజలకు అందిస్తున్నామని



తెలిపారు. త్రాగునీటి పరిరక్షణ, నీటి వనరుల సంరక్షణ కోసం చేపట్టిన చర్యల కారణంగా ఆరేపల్లి గ్రామం జల్ మహోత్సవ పురస్కారానికి ఎంపిక కావడం గర్వకారణమని గ్రామస్తులు పేర్కొన్నారు. కేంద్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జల్ మహోత్సవ కార్యక్రమానికి మండలంలో నుంచి ఆరేపల్లి గ్రామం ఎంపిక కావడం విశేషమన్నారు.

ప్రతి ఇంటికి నాణ్యమైన త్రాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా



గ్రామ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుతున్నాయని సర్పంచ్ ప్రవంతి రాజు తెలిపారు. భవిష్యత్తులో గ్రామంలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అలాగే మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించనున్నామని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం, అంగన్‌వాడీ భవనం పునర్నిర్మాణం చేయడంతో పాటు ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వ గృహ పథకాల ద్వారా ఇళ్లు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

గ్రామ ప్రజలు, వార్డు సభ్యుల సహకారంతో ఆరేపల్లి గ్రామాన్ని మాదిరి గ్రామంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ ప్రవంతి రాజు తెలిపారు.

## బాలికలకు హెచ్‌పీవీ టీకా తల్లిదండ్రులు వినియోగించుకోవాలి

### జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు

**సత్తుపల్లి/, మార్చి 11 (జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో భారతీయ జనతా పార్టీ నాయకులు బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు బాణావత్ విజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం, సాధికారత దిశగా పలు కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ముఖ్యంగా బాలికల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ కోసం హెచ్‌పీవీ టీకాను ప్రభుత్వం ఉచితంగా అందించడం ఎంతో ముఖ్యమైన చర్య అని తెలిపారు. పద్నాలుగు



సంవత్సరాల బాలికలకు ఈ టీకా అందిస్తున్నామని, భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని సుమారు తొంభై ఐదు శాతం వరకు తగ్గించగలదని వివరించారు. తల్లిదండ్రులు తమ కుమార్తెల ఆరోగ్యం దృష్ట్యా ఈ అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో ఈ టీకా ధర ఏడు వేల నుండి పది వేల రూపాయల వరకు ఉంటుందని, అయితే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందుబాటులో ఉండడం గొప్ప అవకాశమన్నారు. అందువల్ల బాలికల ఆధార్ కార్డు తీసుకొని సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి టీకా వేయించుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ఇలాంటి విలువైన ఆరోగ్య సేవలను అందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాకు, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సుదర్శన్ మిశ్రా, జిల్లా కార్యదర్శి పాల నాగ సురేందర్ రెడ్డి, రాష్ట్ర మండలి సభ్యుడు జొన్నలగడ్డ నరేష్, మండల ప్రధాన కార్యదర్శి వేముల లక్ష్మీనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి మందా శివ సాయి, పట్టణ కార్యదర్శి జోనబోయిన కార్తీక్, జోనబోయిన అరుణ, సీనియర్ నాయకులు మన్నెని నరసింహమూర్తి, ఆచంట సుబ్రహ్మణ్యం, మండల నాయకుడు డాక్టర్ పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తాం

### - రిటైర్డ్ హెచ్ఎం ఉబ్బని బిక్షపతి -ఘనంగా తాటికొండ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం

**స్టేషన్ ఘన్పూర్/మార్చి11 (జర్నలిస్ట్ వార్త) :** మండలంలోని తాటికొండ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం హెచ్ఎం, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, దాతలు విద్యార్థిని, విద్యార్థుల మధ్యఘనంగా జరుపుకున్నారు. ప్రధానోపాధ్యా యులు పెనుమతి వెంకటేశ్వర్లు అధ్యక్షన బుధ వారం రోజున తాటికొండ ఉన్నత పాఠశాల వార్షి కోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల వార్షికనివేదికను ప్రధానోపా ధ్యాయులు ప్రవేశపెట్టారు. 2025-2026 విద్యా సంవత్సరంలో పాఠశాల సాధించిన ప్రగతిని, విజ యాలను ఈసందర్భంగా వివరించారు. ఈ విద్యా సంవత్సరం పాఠశాల విద్యార్థులయిన పండుగ రాజేష్,బూరుగు వరుణ్ సందేశ్ లు ఇటీవల నిర్వహించిన సి ఎం కప్ ఆటల పోటీలలో రాష్ట్ర స్థాయిలో పాల్గొన్నారని తెలిపారు. అలాగే ఇటీవ ల నిర్వహించిన ఎన్ ఎం ఎస్ స్కాలర్షిప్ పరీ క్షలలో పాఠశాలకుచెందిన ఐదుగురు విద్యార్థులు గణేష్, సంతోష్, అశ్విని,లక్ష్మీప్రసన్న,ప్రమోద లు ఎంపికయ్యారని తెలుపుతూ వీరందరికీశుభాకాం క్షలు తెలియజేశారు. తమ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు ఆట పాటలు, సంస్కృతిక ఇన్స్పైర్ వంటి విజ్ఞాన పరమైన కార్యక్రమాల్లో పాల్గొని విజయాలు సాధిస్తున్నారని




తెలిపారు. ఈసందర్భంగా పాఠశాల మౌలికవసతుల అభివృ ద్ధికి విరాళాలుఅందచేసిన దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథు లు మాట్లాడుతూ పాఠశాల సాధించిన విజయా లను ప్రశంసిస్తూ భవిష్యత్తులో పాఠశాల అభివృ ద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపా రు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల ఉపన్యాసాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను అలరించాయి. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్పర్సన్ బేతి మంజుల,సర్పంచ్ మార పాక సుజనా శ్రీనివాస్, వార్డు సభ్యులు, దాతలు ఉబ్బని భిక్షపతి, బేతి రాజిరెడ్డి, గుండం రాజు, సుదర్శన్,ఏలియా,సునీత,రుద్రమ దేవి, ఉపా ధ్యా యులు రుద్ర,లింగ మూర్తి, రంజిత్ కుమార్, రవీందర్, డి శ్రీనివాస్, ఎం శ్రీనివాస్,మురళి, అనసూయ, కృపమ్మ, పిడి గీరెడ్డి ప్రమోద్ రెడ్డి, సలావుద్దీన్, ఐలోని రవి, సువర్ణ,జగదీశ్వర్ తో పాటు తల్లిదండ్రులు,పూర్వ విద్యార్థులు,గ్రామస్తు లు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సత్తుపల్లి విభాగ స్థాయిలో టాలెంట్ పాఠశాల విద్యార్థులకు ప్రథమ, తృతీయ బహుమతులు



**సత్తుపల్లి/, మార్చి 11 (జర్నలిస్ట్ వార్త):** శ్రీ రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ తెలంగాణ మరియు శ్రీ రామకృష్ణ సేవా సమితి సత్తుపల్లి వారి ఆధ్వర్యంలో "భారతీయ మహిళ" అనే పుస్తకంపై నిర్వహించిన పరీక్షలో సత్తుపల్లి విభాగ స్థాయిలో టాలెంట్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ పోటీల్లో ముప్పాళ కావ్య ప్రథమ బహుమతి సాధించగా, కొట్టే మౌనిష, చిన్నంశెట్టి లాస్య శ్రీ తృతీయ బహుమతులు అందుకున్నారు. అదేవిధంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన షేక్ ఆస్పియా, షేక్ ఆరీఫా, ఎండి సానియాలకు ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. విజేతలకు గంగారం పదిహేనవ దళాధిపతి అంజయ్య, సత్తుపల్లి మండల విద్యాశాఖ అధికారి రాజేశ్వరరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విజేతలను టాలెంట్ పాఠశాల ప్రతినిధి పులి శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయురాలు పులి అరుణ అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల బాధ్యులు శంకర్, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## భీమదేవరపల్లి లైబ్రరీకి ఎంసెట్, ఐఐటీ పుస్తకాల అందజేత








**భీమదేవరపల్లి/మార్చి11 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి గ్రామ గ్రంథాలయానికి పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను సుమతి రెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ కళాశాల అందించింది. కళాశాలలోని ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్ మరియు ఉన్నత భారత్ అభియాన్ యూనిట్ ఆధ్వర్యంలో, కళాశాల ప్రిన్సిపాల్ డా. ఐ. రాజశ్రీ రెడ్డి మార్గనిర్దేశంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంసెట్, ఐఐటీ వంటి పోటీ పరీక్షలకు సంబంధించిన సుమారు 100 పుస్తకాలను కళాశాల ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్ అడ్వైజర్ మూల రాము ఆధ్వర్యంలో విద్యార్థి వాలంటీర్లు భీమదేవరపల్లి గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామికి మరియు గ్రామ పాలకవర్గానికి అందజేశారు. ఈ పుస్తకాలు గ్రామంలోని విద్యార్థులకు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా ఎంతో ఉపయోగపడతాయని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి వాలంటీర్లు మరియు గ్రామ ప్రతినిధులు పాల్గొన్నారు

## ముల్కనూరు, భీమదేవరపల్లిలో పశువులకు ఉచిత టీకాల పంపిణీ





**భీమదేవరపల్లి/మార్చి11 జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరు ప్రాంతీయ పశు వైద్యశాల ఆవరణలో బుధవారం గోజాతి, గేదె జాతి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ కోసం ఉచిత టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. నాలుగు నెలలు పైబడిన ఆవు దూడలు, గేదె దూడలకు ఈ టీకాలను అందించారు. ఈ కార్యక్రమాన్ని ముల్కనూర్ గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి ప్రారంభించారు. అదేవిధంగా భీమదేవరపల్లి మండల కేంద్రంలో కూడా పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని సర్పంచ్ మాచర్ల కుమారస్వామి, ఉపసర్పంచ్ ఐలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువులకు వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తగా టీకాలు వేయించుకోవాలని పశువుల యజమానులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు డా. మాలతి, రఘు తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన మాజీ ప్రజా ప్రతినిధులు



**స్టేషన్ ఘన్పూర్/మార్చి 11 (జర్నలిస్ట్ వార్త) :** మండలంలోని కొత్తపెల్లిగ్రామంలోఇటీవల 6 వార్డు లో గండి చిన్నవెంకటమ్మ మృతి చెందడం జరిగిం ది, విషయం తెలుసుకున్న మాజీ ప్రజాప్రతినిధు లు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయంగా కుటుంబ సభ్యులను పరామర్శించి

50 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమం లో కంటెస్టెంట్ సర్పంచ్ చెవుల రాకేష్,ఈ సంద ర్భంగా కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ మీరు అధైర్యపడవద్దు మీ కుటుంబానికి నేను ఎల్లప్పుడూ అండగా ఉంటానుఅని భరోసా ఇచ్చారు బాధిత కుటుంబానికి తక్షణ సహాయం గా 50 కేజీల బియ్యం అందజేసి ఆర్థిక సహాయం చేశారు కష్టసమయంలో సమాజంబాధిత కుటుం బానికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఆయనే తెలిపారు. ఈ కార్యక్ర మంలో పాల్గొన్నారు మాజీ ఉప సర్పంచ్లు గండి రాజు, మహేందర్, లింగస్వామి, బిజెపి మండల సెక్రెటరీ మంద రాజేష్ రెడ్డి, బిజెపి మండల అధ్య క్షుడు రొయ్యల సంపత్, మారబోయిన దశరథ, నరేష్, పులిగిల్ల రవి, అనిల్, గోవిందు అశోక్, కొము రయ్య, గండి భాస్కర్, భరత్, గాదరి రమేష్ తదిరదులు పాల్గొన్నారు.

# హాస్టల్లో విద్యార్థులతో ఊడిగం

## పట్టించుకోని వార్డెన్ -సంక్షేమ హాస్టళ్లపై నిఘా విఫలం






**ఎల్కతుర్తి,/ మార్చి 11: (జర్నలిస్ట్ వార్త)** మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ బాలికల హాస్టల్‌లో విద్యార్థులతో పనులు చేయిస్తున్నట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. హాస్టల్‌లో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలిపారు.మండల కేంద్రంలో ఉన్న ఈ హాస్టల్‌లో ప్రస్తుతం కేవలం 20 నుంచి 25 మంది విద్యార్థులు మాత్రమే ఉంటున్నట్లు సమాచారం. హాస్టల్ వార్డెన్ స్థిరంగా ఉండకపోవడంతో విద్యార్థుల బాగోగులు వంటమనిషి, నైట్ వాచ్మెన్ చూసుకుంటున్న పరిస్థితి నెలకొంది. దీంతో కొంతమంది విద్యార్థులు హాస్టల్‌ను వదిలి వెళ్లిపోయినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

హాస్టల్‌లోని విద్యార్థులతో మంచినీరు తెప్పించడం, షాపులకు పంపించడం వంటి పనులు చేయిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా గిన్నెలు తోమించడం, ఊడవడం వంటి పనులు కూడా చేయిస్తున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇక ఎస్సీ బాలుర హాస్టల్‌తో పాటు బీసీ బాలికల హాస్టళ్లపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ పూర్తిగా విఫలమైందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. గోపాల్పూర్ ఎస్సీ హాస్టల్‌లో కూడా సరైన వసతులు లేక విద్యార్థులు హాస్టల్‌ను విడిచిపెడుతున్నట్లు తెలుస్తోంది.హాస్టల్ వార్డెన్లు హాస్టల్‌లో ఉండకుండా ఇంటి దగ్గర కాలయాపన చేస్తూ జీతాలు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ధర్మసాగర్‌లో కోతుల బెడద

## సుమారు 200 కోతుల సంచారం - భయాందోళనలో గ్రామస్తులు

**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో మార్చి 11(జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతూ గ్రామస్తులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. గ్రామంలోని పలు కాలనీలు, వీధుల్లో సుమారు 200కు పైగా కోతులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇళ్ల ఆవరణల్లో ఉన్న చెట్లపై నివాసం ఏర్పరచుకున్న కోతులు తరచూ ఇళ్లపైకి ఎక్కి కప్పులు, టైల్స్‌ను ధ్వంసం చేస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు.



**ఇళ్లపైకి ఎక్కి నష్టం**

ఇంటి ఆవరణలో ఉన్న చెట్లపై నుంచి కోతులు ఇళ్లపైకి దూకుతూ కప్పులను పగులగొట్టడం, టిన్ షీట్లు, ఆస్బెస్టాస్ షీట్లు దెబ్బతీయడం జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. కొన్నిచోట్ల ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడం, ఆవరణలో ఉంచిన బట్టలను చింపేయడం వంటి ఘటనలు కూడా జరుగుతున్నాయని తెలిపారు.

**కరవడంతో భయాందోళన**

ఇటీవల కొంతమందిని కోతులు కరవడంతో గ్రామంలో భయం మరింత పెరిగింది. చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రావడానికి కూడా భయపడే పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు చెబుతున్నారు. పాఠశాలల సమీపంలో కూడా కోతులు సంచరిస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

**చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**

ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి కోతులను పట్టుకొని సమీప అడవులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. సమస్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో తక్షణమే చర్యలు తీసుకుని గ్రామస్తులకు ఉపశమనం కల్పించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు.

## -పదేళ్ల పాఠశాల ప్రయాణం.. -వెలకట్టలేని స్నేహాలు.. --కన్నతండ్రిలా విద్యాబుద్ధులు నేర్పిన గురువులు.



**బయ్యారం/మార్చి 11.(జర్నలిస్ట్ వార్త):**బయ్యారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం అత్యంత భావోద్వేగాల మధ్య జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంఈవో దేవేంద్ర చారి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు 10వ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు.9వ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఈ వీడ్కోలు సమావేశం కేవలం వేడుకగానే కాకుండా ఆత్మీయ కలయికగా మారింది.పాఠశాల ప్రాంగణంలో గడిపిన ప్రతి క్షణం విద్యార్థుల కళ్లముందు కదలాడాయి.తమను తీర్చిదిద్దిన ఉపాధ్యాయుల పాదాలకు నమస్కరిస్తూ విద్యార్థులు కృతజ్ఞతలు తెలుపుతున్నప్పుడు పలువురి కళ్లు చెమర్చాయి. విద్యార్థుల తరగతి గదిలో సందడి, ఆటస్థలంలో కేరింతలు,భోజనాలు పంచుకున్న రోజులను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు కౌగిలించుకుని వీడ్కోలు చెప్పుకున్నారు. రేపు పాఠశాల గంట మోగితే తాము ఇక్కడ ఉండమన్న ఆలోచన వారిని కలిచివేసింది. అయితే తమ సీనియర్ల భవిష్యత్ బంగారుమయంగా ఉండాలని 9వ తరగతి విద్యార్థులు ఆకాంక్షించి వారిని సాగనంపారు.వీడ్కోలు అంటే విడిపోవడం కాదు.. కొత్త శిఖరాలను అధిరోహించేందుకు చేసే మరో ప్రయాణం అని ఉపాధ్యాయులు విద్యార్థులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, రామేశ్వరరావు,వడ్డబోయిన శ్రీనివాస్,భూక్య రవీందర్, దస్తగిరి, బూర్ల సుధాకర్,కొలిపాక శ్రీనివాస్, లక్ష్మయ్య, హథీరామ్ కె.సునీత, శ్రీరామ్,నజీమా, విజయ, సైదాబీ పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్ లో సత్తా చాటిన తాటికొండ విద్యార్థులు



**స్టేషన్ ఘన్పూర్/మార్చి 11 (జర్నలిస్ట్ వార్త);** నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ కు పరీక్ష రాసిన వారిలో మండలం తాటికొండ ఉన్నత పాఠ శాలకు చెందిన ఐదుగురు 8వ తరగతి విద్యార్థు లు నారబోయిన లక్ష్మీ ప్రసన్న, ముంత అశ్విని, మావురపు ప్రమోద, లావుడ్య గణేష్, కుంభోజు సంతోష్ లు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ కు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయు లు పెనుమాటి వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నవంబర్ లో నిర్వహించిన నేషనల్ మీన్స్ కంమెరిట్ స్కాల ర్షిప్ పరీక్షకు పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థు లు హాజరుకాగా, అందులో ఐదుగురు విద్యార్థు లు ఈ స్కాలర్షిప్ కు ఎంపికైనట్లు తెలియజేశారు. ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతినుండి ఇంటర్ పూర్తయ్యే వరకు ప్రతి సంవత్సరం 12 వేలరూపా యల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు 48 వేల రూపాయలు స్కాలర్షిప్ గా అందనుందని తెలిపారు.ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరి చిన విద్యార్థులను,వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యా యులను ప్రధానోపాధ్యాయులు పెనుమాటి వెంక టేశ్వర్లు,అమ్మఆదర్శపాఠశాల చైర్మన్ బేతి మంజు ల అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు రుద్ర, లింగమూర్తి, రంజిత్ కుమార్, శ్రీనివాస్, రవీందర్,శ్రీనివాస్, మురళి,అనసూయ, కృపమ్మ, సలావుద్దీన్, జగదీశ్వర్, ఐలోని రవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నీలారపు సంజయ్ జన్మదిన వేడుకలు.



**బయ్యారం/,మార్చి 11.(జర్నలిస్ట్ వార్త);** బయ్యారం మండలం మేజర్ గ్రామ పంచాయితీ బిఆర్ఎస్ పార్టీ నాయకులు నీలారపు సంపత్ యాదవ్ కుమారుడు సంజయ్ యాదవ్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు ఆజ్మీర కల్పన సునిల్ నాయక్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు వీరన్న నాయక్ ఇస్లావత్,రచ్చ చంద్రమౌళి, మేజర్ గ్రామపంచాయితీ బయ్యారం సోషల్ మీడియా ఇంచార్జి సందీప్ యాదవ్ చందు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు సర్పంచ్ చేయూత.



**బయ్యారం/మార్చి 11.(జర్నలిస్ట్ వార్త);** బయ్యారం మండలం కోయగూడెం గ్రామపంచాయతీ పరిధిలోనీ సుద్దరేవు గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో బ్లాక్ బోర్డు కలర్ పోయి అక్షరాలు కనపడక విద్యార్థులు పడుతున్న ఇబ్బంది గురించి ఉపాధ్యాయులు గ్రామ సర్పంచ్ లింగా నాయక్ తెలియజేయడంతో వెంటనే స్పందించిన సర్పంచ్ పాఠశాలను సందర్శించి సొంత ఖర్చుతో బోర్డుకి బ్లాక్ కలర్ వేయించారు.పాఠశాల పిల్లలకి ఇబ్బంది కలగకుండా టీచర్ రాసిన అక్షరాలు బోర్డు మీద కనబడాలని పిల్లలు మంచి ప్రయోజకులవాలని బ్లాక్ బోర్డుకు కలర్ వేయించిన సర్పంచ్ లింగా నాయక్ కీ ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## బయ్యారంలో నేడు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ శిబిరం.



**బయ్యారం/,మార్చి 11.(జర్నలిస్ట్ వార్త);** బయ్యారం మండల కేంద్రంలో పద్మశాలి సంఘం కమ్యూనిటీ హాలులో నేడు సాయంత్రం 4 గంటలకు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ శిబిరం మండలంలో ప్రశిక్షణ కార్యక్రమం బీజేపీ కార్యదర్శి తుమ్మల శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చెయ్యనున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు వల్లబు వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరు అవుతున్నారు.కావున మండలంలోని బీజేపీ సీనియర్ కార్యకర్తలు,నాయకులు,పార్టీ సానుభూతిపరులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని తుమ్మల శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

## ఎస్సీ విద్యార్థుల ఖాతాల్లోకి 374 కోట్ల రూపాయల నిధులు

**హైదరాబాద్,మార్చి 11 (జర్నలిస్ట్ వార్త);** పోస్టుమెట్రిక్ స్కాలర్షిప్స్ క్రింద ఎస్సీ విద్యార్థులకు బోధనా రుసుములు మరియు మెయింటెనెన్స్ చార్జీలను 2024-25 సంవత్సరం నుండి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో చెల్లిస్తున్నాయన్న విషయమూ, అట్టి సొమ్ము విద్యార్థుల ఖాతాల్లోకి నేరుగా జమ చేయడం జరుగుతోంది. ఇందులో భాగంగా ఈ సంవత్సరంలో ఇప్పటికి రూ. 374.00 కోట్ల నిధులు, రాష్ట్రంలోని వివిధ కళాశాలలకు చెందిన 83239 మంది ఎస్సీ విద్యార్థుల ఖాతాల్లోకి నేరుగా జమ చేయడమైనది. ఇందులో రాష్ట్రప్రభుత్వం తన వాటా కింద రూ.173.00 కోట్లు విడుదల చేయగా కేంద్రప్రభుత్వం రూ. 201.00 కోట్లు విడుదల చేసింది. విద్యార్థులు తమకు చెందిన మెయింటెనెన్స్ అమౌంట్ ను మినహాయించుకుని, బోధానా రుసుమును (ట్యూషన్ ఫీజు) ఇతరేతర రుసుములను కళాశాలకు చెల్లించాల్సి ఉంటుంది. ఉపకారవేతన నిధులు జమ చేయబడిన విద్యార్థుల వివరాలు సంబంధిత కళాశాల ప్రిన్సిపల్స్ ఈ-పాస్ లాగిన్స్ లో పొందుపరచడం కూడా జరిగిందని తెలియజేస్తున్నాం. నిధులను విడుదల చేసిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, ఉపముఖ్యమంత్రివర్యులు ఆర్థిక శాఖామాత్యులు భట్టి విక్రమార్క రికి ఉపకారవేతనాలు పొందిన విద్యార్థులు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. నిధుల విడుదలకై విశేషమైన కృషి చేసిన ఎస్సీ అభివృద్ధిశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి ఎస్సీ విద్యార్థులందరూ మనస్ఫూర్తిగా తమ కృతజ్ఞతలు తెలియజేశారు.